సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 26 । జూన్ । 2025



వానాకాలం.. పిడుగుల గండం

ఎండాకాలం తర్వాత వచ్చే వర్షాకాలం చాలా ఆహ్లాదంగా ఉంటుంది. అదే సమయంలో వర్షాకాలం ప్రమాదాలను కూడా తీసుకువస్తుంది. వాటిలో పిడుగులతో అనేక అనర్థాలు కలుగుతాయి.


10లో



సత్యదేవా... చూడవయ్యా..

ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి రూపాయినీ ఆచితూచి ఖర్చు చేయాలి.

డెల్టా కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు బుధవారం గోదావరి డెల్టా కాలువలకు 11,700 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,300, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద 9.10 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది.

న్యూస్‌రీల్

వాడపల్లికి 96 ఆర్టీసీ బస్సులు

అమలాపురం రూరల్: ఆత్రేయపురం మండలం వాడపల్లిలో కొలువైన వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ప్రతి శనివారం 96 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌టీపీ రాఘవ కుమార్ తెలిపారు. జిల్లాలోని అన్ని డిపోల నుంచి 22 ప్రత్యేక బస్సు సర్వీసులతో పాటు రావులపాలెం నుంచి వాడపల్లికి 8 బస్సులు తిరుగుతున్నాయన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే వాటితో కలిపి సుమారుగా 96 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ మహేష్ కుమార్, డీడీవో డి.శ్రీనివాసరావు సూచనల మేరకు ప్రయాణికుల సౌకర్యార్థం రావులపాలెం నుంచి వాడపల్లికి ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

జిల్లాలో 7.1 మిల్లీమీటర్ల వర్షపాతం



అమలాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో జిల్లాలో వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం సాయంత్రం వరకూ పడుతూనే ఉంది. చినుకులతో మొదలై, ఒక మోస్తరు నుంచి భారీగా కురిసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకూ జిల్లా వ్యాప్తంగా సగటు 7.1 మిల్లీమీటర్ల వర్షంపాతం నమోదైంది. అత్యధికంగా ఆత్రేయపురం, రామచంద్రపురం మండలాల్లో 17.1 మిమీ, అత్యల్పంగా మండపేటలో 1.4 మిమీ కురిసింది. మండలాల వారీగా కొత్తపేటలో 11.4, ఆలమూరు 10, అయినవిల్లి 9.8, రావులపాలెం 8.6, మలికిపురం 8.4, సఖినేటిపల్లి 8.4, కపిలేశ్వరపురం 6.4, కె.గంగవరం 6.2, పి.గన్నవరం 5.8, అమలాపురం 4.2, రాజోలు 5.4 ముమ్మిడివరం 5.4, అల్లవరం 4.6, కాట్రేనికోన 4.6, మామిడికుదురు 3.8, ఉప్పలగుప్తం 3.6, ఐ.పోలవరం 4.6, అంబాజీపేట 1.8, రాయవరం 1.2 మిల్లీమీటర్లు చొప్పున నమోదైంది.

ఏపీ పీజీ సెట్‌లో అధ్యాపకుడికి మొదటి ర్యాంకు



మనోహర్

అమలాపురం రూరల్: ఏపీ పీజీ సెట్‌లో 2025 (అసెట్) ఫలితాలలో అమలాపురం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఫిజిక్స్ అధ్యాపకుడు కేవీవీఎస్ మనోహర్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారు. ఫిజికల్ సైన్స్ విభాగంలో 91/100 మార్కులతో ఓపెన్ కేటగిరీలో ఫస్ట్ ర్యాంకు సాధించారు. ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఏ, ఎంఈటీలలో ప్రవేశానికి రాష్ట్ర స్థాయిలో 13 యూనివర్సిటీలు కలిపి ఈ సెట్ నిర్వహించాయి. ఆయనతో పాటు ఆ కళాశాల విద్యార్థులైన ఎ.సతీష్ 220, సీహెచ్ ప్రసాద్ 320 ర్యాంకులు సాధించారు. కాగా.. మనోహర్‌ను కరస్పాండెంట్ కేవీఆర్ నరసింహారావు, చైర్ పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ ప్రవీణ్, సీనియర్ అధ్యాపకుడు వరప్రసాద్ అభినందించారు.

రేపు జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధికల్పనాధికారి జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మెడిప్లస్, జీవీఎస్ టెక్నాలజీ, శ్రీభవానీ కాస్టింగ్, ఇన్నోసోర్స్ సర్వీస్ లిమిటెడ్, పేటీఎం సంస్థలు 615 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయన్నారు. పదో తరగతి అపై విద్యార్హతల గల అభ్యర్థులు ఉదయం 9 గంటలకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలని, వివరాలకు 86398 46568 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలి

కాకినాడ క్రైం: పోలీసులపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని, అందుకు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాకినాడలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళలు, బాలలపై చోటు చేసుకుంటున్న నేరాలను నియంత్రించాలన్నారు. హైవేలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయాలన్నారు. మిస్సింగ్ కేసులు, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కుటుంబ కలహాల్లో పరస్పర దాడులు జరగకుండా చూడాలన్నారు. ఆస్తుల చోరీల్లో రికవరీలు పెంచాలన్నారు. డ్రోన్ల సాయంతో శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రాంతాలపై నిఘా పెంచాలని సూచించారు. గంజాయి నిందితులను గుర్తించి నేరాల బాట పట్టకుండా చూడాలని ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో ఏలూరు ఐజీపీ జీవీజీ అశోక్‌కుమార్ టెలికాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

విలీనాగ్రహం

- పాఠశాలల విలీనంపై తల్లిదండ్రుల ఆందోళన
- వర్షంలోనే ధర్నాలు
- పిల్లలకు విద్య దూరమవుతుందని ఆవేదన
- పలుచోట్ల నిరసనలు



సాక్షి, అమలాపురం/ ఉప్పలగుప్తం: పాఠశాలల విలీనంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల దూరంగా ఉండే పాఠశాలలకు వెళ్లి పిల్లలు చదువుకోవాల్సిన వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ విధానానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్నారు. వివరాల్లోకి వెళితే.. పాఠశాలల రీస్ట్రక్చరింగ్ విధానం పలుచోట్ల చిన్నారులకు దూరాభారంగా మారుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల అభివృద్ధికి తీసుకువచ్చిన 117 జీవోకు వ్యతిరేకంగా చేపట్టిన పాఠశాలల రీస్ట్రక్చరింగ్ తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తోంది. ఇది విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడిచేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పదేళ్లలోపు చిన్నారులు ఉన్న ఊరిని వదిలి, దూర ప్రాంతాలకు ఎలా వెళతారని ప్రశ్నిస్తున్నారు.

ఆందోళన బాట

రెండున్నర కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు వెళ్లి తమ పిల్లలు ఎలా చదువుకుంటారని రాజోలు మండలం ములికిపల్లిలోని బాలయోగి కాలనీ వాసులు ఈనెల 19వ తేదీన ఆందోళన చేపట్టారు. దీనిలో భాగంగా ఒకటి, రెండు తరగతులు చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడిని బయటికి పంపించి పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ పాఠశాల నుంచి మూడు, నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న 37 మంది విద్యార్థులను పక్క గ్రామమైన కూనవరంలో పాఠశాలకు తరలించారు. సుమారు 2.5 కిలోమీటర్ల దూరంలోని ఆ పాఠశాలకు తాము పిల్లలను తీసుకుని వెళ్లడం సాధ్యం కాదని తల్లిదండ్రులు చెబుతున్నారు. కూలి పనులు చేసుకునే తాము.. రోజూ పిల్లలను ఎలా తీసుకువెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా ఆ పాఠశాలను సందర్శించి, విద్యార్థులను వేరే గ్రామానికి తరలించబోమని చెప్పడంతో తల్లిదండ్రులు శాంతించారు.

- కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలో పాఠశాలను మరో పాఠశాలలో విలీనం చేయడంతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లులు ఈ నెల 20న మండల పరిషత్ సమావేశానికి వచ్చి నిరసన తెలిపారు. అలాగే కొత్తపేట పాఠశాలలో ఒక పాఠశాల విలీనం చేయడాన్ని స్థానిక ఎంపీటీసీ నాగేశ్వరరావు ఖండించారు. చిన్నారులు అంతదూరం ఎలా నడిచి వెళతారని ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

తల్లిదండ్రులు మాట్లాడుతూ పేద విద్యార్థుల జీవితాలతో విద్యాశాఖ అధికారులు చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే ఇన్ని ఇబ్బందులకు గురి చేస్తారా అని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ పిల్లలను శ్రీరామ్ నగర్ పాఠశాలకు పంపించబోమని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. పాఠశాల ఎదుట నిలబడి వర్షంలో తడుస్తూ పాఠశాలను ఇక్కడే ఉంచాలని నినాదాలు చేశారు. ఇది అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సొంత గ్రామం కావడం విశేషం. వీరు గత వారం రోజులుగా ఆందోళన చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది.

వర్షంలో ఆందోళన

ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాలల తల్లిదండ్రులు ఆ పాఠశాల విలీనాన్ని నిరసిస్తూ రోజుల తరబడి ఆందోళన చేస్తున్నారు. ఈ పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతులను సమీపంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. కిలోమీటరు దూరంలోని శ్రీరామ్ నగర్‌లోని మోడల్ ప్రైమరీ పాఠశాలకు తరలిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 21న తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. దూరంగా ఉన్న ప్రాంతాలకు పంపడం తమకు ఇబ్బందికరమని రోడ్డు ఎక్కి ఆందోళనకు దిగారు. అయినా ఉన్నతాధికారులలో చలనం లేదు. దీనితో బుధవారం వర్షంలోనే మరోసారి ఆందోళనకు దిగారు. విద్యార్థులను శ్రీరామ్ నగర్ పాఠశాలకు పంపించకుండా దగ్గరలోని హైస్కూల్లో కొనసాగిస్తామని హామీ ఇచ్చి, మరలా ఇప్పుడు టీసీలు తీసుకొని శ్రీరామ్ నగర్‌కు వెళ్లాలని మాట మార్చడంతో విద్యాశాఖ అధికారుల తీరును తప్పుపట్టారు. ఈ మేరకు విద్యార్థులతో కలసి బుధవారం పెద్దపేట పాఠశాల వద్ద ఉదయం నుంచీ కురుస్తున్న వర్షంలో ధర్నా చేశారు.

రీస్ట్రక్చరింగ్ తర్వాత జిల్లాలో పాఠశాలల పరిస్థితి

బేసిక్ ప్రైమరీ స్కూళ్లు	887
కంటిన్యూ ఏజ్ యూపీ స్కూళ్లు	42
డౌన్‌గ్రేడ్ టు బేసిక్ ప్రైమరీ స్కూళ్లు	07
డౌన్‌గ్రేడ్ టు మోడల్ ప్రైమరీ స్కూళ్లు	02
ఫౌండేషన్ పాఠశాలలు	198
ఉన్నత పాఠశాలలు	180
హైస్కూల్/బీపీఎస్	34
హైస్కూల్/ఎంపీఎస్	03
హైస్కూల్/బీపీఎస్	08
మోడల్ ప్రైమరీ స్కూళ్లు	190
అప్‌గ్రేడ్ టు హైస్కూల్+న్యూ బీపీఎస్	04
అప్‌గ్రేడ్ టు హైస్కూల్ + న్యూ ఎంపీఎస్	11
జిల్లాలో మొత్తం పాఠశాలలు	1567
క్లోజ్డ్ స్కూళ్లు	09



రాజోలు మండలం ములికిపల్లిలోని బాలయోగి కాలనీ వాసుల ఆందోళన (ఫైల్)

సత్యదేవునికి సిరుల వృష్టి



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సేవా సంస్థల సిబ్బంది

అన్నవరం: రత్నగిరి సత్యదేవునికి రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. గత 35 రోజులకు హుండీల ద్వారా రూ.2,12,38,410 ఆదాయం సమకూరింది. బుధవారం హుండీలను లెక్కించగా రూ.2,00,76,264 కరెన్సీ, రూ.11,62,146 చిల్లర నాణేలు వచ్చాయని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు. సరాసరిన రోజుకు రూ.6,06,811 నమోదైనట్టు తెలిపారు. సాధారణంగా స్వామివారి హుండీ ఆదాయం నెలకు రూ.1.2 కోట్ల నుంచి రూ.1.5 కోట్ల వరకు వస్తుంది. కానీ రూ.2 కోట్లు దాటి రావడం అరుదనే చెప్పాలి.

602 గ్రాముల బంగారం..

హుండీలలో నగదుతో పాటు బంగారం సైతం రికార్డు స్థాయిలో 602 గ్రాములు వచ్చింది. బంగారం సైతం ప్రతి నెలా 50 నుంచి 60 గ్రామలు మాత్రమే వస్తుంది. ఈ సారి ఏకంగా పది రెట్లు రావడం గొప్ప విషయమే. ఈ బంగారం మార్కెట్ విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుంది. అలాగే వెండి 613 గ్రాములు వచ్చిందని అధికారులు తెలిపారు. ఓ కుటుంబం స్వామి వారికి నిలువుదోపిడీ (తాము ధరించిన ఆభరణాలు) సమర్పించినట్టు అధికారులు తెలిపారు. అలాగే వంద గ్రాముల బంగారు బిస్కెట్ కూడా హుండీలో వచ్చినట్టు తెలిపారు. హుండీల ద్వారా పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీ కూడా లభించింది. అమెరికన్ డాలర్లు 87, సౌదీ అరేబియా రియల్స్ 55, సింగపూర్ డాలర్లు రెండు, బోత్సా్వనా కరెన్సీ రెండు పులాలు, ఖతార్ రియల్స్ ఒకటి, యూఏఈ దీరామ్స్ 40, యూరోలు 20, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ బైసా 600 లభించాయి.

పోటెత్తిన భక్తులు

సత్యదేవుని కల్యాణోత్సవాల అనంతరం మే 21న లెక్కించిన తరువాత మళ్లీ బుధవారం హుండీలను లెక్కించారు. వేసవి సెలవులు, వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో వివాహాలు ఎక్కువగా జరగడం, భక్తులు భారీగా తరలి రావడంతో రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరినట్టు అధికారులు చెబుతున్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ మహేష్ కుమార్
- అధికారులతో సమీక్ష

అమలాపురం రూరల్: వర్షాల నేపథ్యంలో గోదావరికి వరదలు సంభవిస్తే, చేపట్టాల్సిన సహాయక చర్యలపై అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ విపత్తుల సహాయక చర్యలపై ప్రతి శాఖ సమాయత్తం కావాలని, గోదావరి తీరం వెంబడి ఉన్న మండలాలకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలన్నారు. కావాల్సిన అవసరాలపై జూలై మొదటి వారంలో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్నచోట్ల సైనింగ్ బోర్డులను ఏర్పాటు చేస్తూ గట్ల పటిష్టతకు ఇసుక సంచులను సిద్ధం చేసుకోవాలని జలవనరుల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. పశువులకు పునరావాసం కల్పించి టోటల్ మిక్సర్ రేషన్ (టీఎంఆర్) పశుగ్రాసాన్ని సరఫరా చేయాలని ఆ శాఖ అధికారుకు తెలిపారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ బి.కృష్ణారావు మాట్లాడుతూ పోలీస్ శాఖ సహాయ చర్యలకు సన్నద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజకుమారి, ఆర్డీవోలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



డీఆర్‌ఓ రాజకుమారికి ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్, జేసీ నిషాంతి తదితరులు

ప్రశంసాపత్రాల అందజేత

యోగాంధ్రలో భాగంగా ఈ నెల మూడో తేదీన బీచ్, దేవాలయ యోగాసనాల కార్యక్రమంలో అంతర్వేది సముద్ర తీరంలో మూడు వేల మందితో నిర్వహించిన వృక్షాసన భారీ మానవహార యోగాసనలో జిల్లాకు ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు దక్కిందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు విజయోత్సవాన్ని గోదావరి భవన్‌లో అధికారులతో కలిసి నిర్వహించారు. జిల్లా యోగేంద్ర నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ నిషాంతి సారథ్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతమయ్యాయన్నారు. ఈ సందర్భంగా పలువురు జిల్లాస్థాయి అధికారులను ప్రశంసాపత్రాలు అందించి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు డీఆర్‌ఓ రాజకుమారి ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

భూ పరిపాలన అంశాలపై ప్రత్యేక దృష్టి

భూ పరిపాలన అంశాలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి, కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అమరావతి నుంచి బుధవారం కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీవో ఎంఎస్ నంబర్ 30 ప్రకారం భూముల క్రమబద్ధీకరణ, అందరికీ ఇళ్లు, నూతన కోర్టు భవనాలు తదితర వాటిపై సమక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ఆన్‌లైన్, పెండింగ్ సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియపై అందిన దరఖాస్తులను విచారించి అర్హతల మేరకు క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. అలాగే మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు, మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌కు సహకరించండి

డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సహాయ, సహకారాలను అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటావు రాజకీయపార్టీలను కోరారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లాలో చేపడుతున్న ప్రీ రివిజన్ కార్యక్రమాలు, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌పై వివరించి, వారి సహకారాన్ని కోరారు. జిల్లాలో వెయ్యి నుంచి 1200 మంది ఉన్న పోలింగ్ స్టేషన్లు 584 ఉండగా, అంతకు పైబడి ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లను 292 ఉన్నాయన్నారు. వీటిలో సుమారు 400 స్టేషన్లను ఓటర్ల సౌలభ్యం కోసం పునర్వ్యవస్థీకరణ, కొత్త స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించనున్నట్టు తెలిపారు. పోలింగ్ నిర్వహణకు అనువుగాలేని కేంద్రాలను ఇతర భవనాలకు మార్చేలా ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ప్రస్తుతం జిల్లాలోని 1640 పోలింగ్ కేంద్రాలను ఈ నెల 30వ తేదీన ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌వోలు సందర్శించి పరిశీలిస్తారన్నారు. ఈ లోపు రాజకీయ నాయకులు తాము గమనించిన అంశాలు, సూచనలను తమకు తెలియజేయాలని డీఆర్వో కోరారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం జులై 7న పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణపై కసరత్తు చేస్తామన్నారు. జూలై 12 నుంచి 17వ తేదీలోపు కేంద్రాల సెక్షన్లు, పార్టులు, బౌండరీలు, లొకేషన్లను నిర్ధారిస్తారన్నారు. అనంతరం జులై 20వ తేదీన జిల్లా ఎన్నికల అధికారి పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా ప్రకటించి రాజకీయ పార్టీలకు ప్రతిపాదనలను వివరించి, 30వ తేదీవరకు సూచనలు, అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. అనంతరం ఆగస్టు 2న పోలింగ్ స్టేషన్ల ముసాయిదా ప్రతిపాదనలపై చర్చిస్తారన్నారు. అవసరమైన సూచనలు, మార్పులను ఆగస్టు ఐదో తేదీ నాటికి పూర్తి చేసి ఎన్నికల కమిషన్ ఆమోదానికి పంపుతారన్నారు. రాజకీయ పార్టీల నేతలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన బీఎల్‌ఏ-2 ఫారమ్‌లో వివరాలను తెలియజేయాలని ఆర్డీవో వెంకటరావు కోరారు.

ఇన్‌స్పైర్‌కు వేళాయె..

- సృజనాత్మక ఆవిష్కరణలకు ఆహ్వానం
- ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులు పంపే వీలు
- బాల శాస్త్రవేత్తలకు భలే అవకాశం

రాయవరం: చిన్నారుల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీసి, వారిలో విజ్ఞాన జిజ్ఞాసను రేకెత్తించేందుకు ఇన్‌స్పైర్ మనక్ ఎంతో దోహదపడుతుంది. కేంద్ర, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిన ప్రతిభను బయటకు తీయడం, సైన్స్‌పై వారికి ఆసక్తిని పెంచడం దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో 2025 – 26 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి నూతన ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు.

ప్రతి పాఠశాలకూ అవకాశం

ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ విద్యా సంస్థల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులతో కలిసి ఇన్‌స్పైర్ మనక్ ప్రోగ్రామ్‌లో పాల్గొనవచ్చు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రతి తరగతి నుంచి ఒకరు వంతున ప్రాథమికోన్నత పాఠశాలకు మూడు, ఉన్నత పాఠశాలలు ఐదు ప్రాజెక్టులను నమోదు చేసుకునే వీలుంది. 2008–09 సంవత్సరం నుంచి ఏటా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

ప్రాజెక్టులను పంపండిలా..

www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా సెప్టెంబరు 15వ తేదీ లోపు పాఠశాల విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టాలి. వారి నుంచి రూపుదిద్దుకున్న ప్రాజెక్టుల వివరాలను నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు వీలుగా రూ.10 వేల పారితోషకం, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటి జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25 వేల వరకు తమ ప్రాజెక్టును మెరుగుపర్చుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులు కేటాయిస్తుంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన తదితర అవకాశాలతో పాటు ఇంజినీరింగ్ కళాశాల విద్యలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. జాతీయస్థాయికి ఎంపికై న ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశముంది. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలి.



గతేడాది జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని (ఫైల్)

నిబంధనలు ఇవే..

ముందుగా పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటేషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను తీర్చే విధంగా ఆలోచన ఉండాలి. తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, ఆలోచనకు అవసరమైన ప్రాజెక్టును రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతిని నమోదు చేయాలి. విద్యార్థికి సంబంధించిన బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ నంబరు ఎంటర్ చేయాలి. విద్యార్థి ప్రాజెక్టు సంక్షిప్తంగా, రాత పూర్వకంగా పొందుపర్చి, సంబంధిత రైటప్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టు ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయికి ఎంపికకు పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టుకు ప్రయోగం నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేస్తారు. ఈ దరఖాస్తుకు సెప్టెంబరు 15 తుది గడువు.

జిల్లాలో పరిస్థితి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి గత విద్యా సంవత్సరంలో 1,468 ప్రాజెక్టులు నమోదు కాగా, 115 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఎంపికైన ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థుల ఖాతాలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున జమ చేశారు. అయితే అత్యధిక ప్రాజెక్టులు రిజిస్టర్ అయినప్పటికీ ప్రాజెక్టుల రూపకల్పనలో నాణ్యతా ప్రమాణాలు లోపించడం వల్ల ప్రాజెక్టుల ఎంపిక సంఖ్య తగ్గుతోందనే విమర్శలున్నాయి. ప్రాజెక్టులో సృజనాత్మకత, నాణ్యత లోపించడంతో దీనికి కారణమని చెబుతున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 42 ప్రాథమికోన్నత, 228 ఉన్నత పాఠశాలలు ఉండగా, ప్రైవేట్ యాజమాన్యం పరిధిలో 170 ప్రాథమికోన్నత, 157 ఉన్నత పాఠశాలలున్నాయి.

హెచ్‌ఎంలు చొరవ చూపాలి



విద్యార్థులు సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించేలా సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలి. జిల్లా నుంచి అత్యధికంగా నామినేషన్లు నమోదు అయ్యేలా చూడాలి. విద్యార్థులకు ఇది ఒక చక్కని అవకాశం.

– డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి

జాతీయ స్థాయిలో నిలిచేలా..



రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీ పడేలా ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించాలి. ఈ ప్రక్రియను సైన్స్ ఉపాధ్యాయులు పర్యవేక్షించాలి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్సు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి.

– గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి

క్లుప్తంగా

ఏసీబీ వలలో చల్లపల్లి వీఆర్‌ఓ


లంచం తీసుకుంటూ పట్టుబడిన వీఆర్‌ఓ శ్రీమన్నారాయణ

ఉప్పలగుప్తం: పట్టాదారు పాసు పుస్తకం ఇచ్చేందుకు రూ.20 వేలు లంచం తీసుకుంటున్న చల్లపల్లి చింతలచెరువు–3, గ్రేడు–1 వీఆర్‌ఓ పరసా శ్రీమన్నారాయణను ఏసీబీ అధికారులు బుధవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చల్లపల్లి గ్రామానికి చెందిన రైతు మేకల సోమేశ్వర సత్య శ్రీరామ్ తన తల్లి మేకల రాజేశ్వరి పేరిట కొనుగోలు చేసిన భూమికి మ్యూటేషన్ చేసి పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్ ఇప్పించేందుకు వీఆర్వోను సంప్రదించారు. పట్టాదారు పుస్తకం కోసం కొంత సొమ్ము ఇవ్వగా, మరో రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం వీఆర్‌ఓ శ్రీమన్నారాయణ అల్లవరం మండలం సామంతకుర్రులోని తన నివాసంలో రూ.20 వేలు లంచం తీసుకుండగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి జ్యూడీషియల్ కస్టడీకి తరలించామని ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్ తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ


సీసీ కెమెరాలో రికార్డు అయిన దొంగ

కడియం: మండలంలోని దుళ్లలో గల మద్యం దుకాణంలో మంగళవారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. షాపు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు షాపు సీలింగ్ రేకును తొలగించి లోపలకు ప్రవేశించారు. లోపల ఉన్న విలువైన మద్యం బాటిళ్లతో పాటు చీప్ లిక్కర్ బాటిళ్లు, సుమారు రూ.పది వేలు పట్టుకుపోయారు. షాపు చుట్టూ ఉన్న సీసీ కెమెరాలను దొంగలు ధ్వంసం చేశారు. అయితే లోపలి వైపు ఉన్న సీసీ కెమెరాలో ఒక దొంగ కదలికలు రికార్డు అయ్యాయి. షాపు సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయం

దేవరపల్లి: సైబర్ నేరగాళ్ల వలలో పడి ఒక వ్యాపారి మోసపోయిన సంఘటన బుధవారం నల్లజర్ల మండలం అనంతపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. అనంతపల్లికి చెందిన ఓంకారపు గౌతమ్‌కు మెసేజ్ వచ్చింది. మొబైల్‌లో వాట్సాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలని దాని సారాంశం. దీంతో గౌతమ్ అప్‌డేట్ చేస్తుండగా వచ్చిన ఓటీపీని క్లిక్ చేశాడు. ఐదు నిమిషాల వ్యవధిలోనే అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.30 వేలు మూడు పర్యాయాలు మాయమైంది. జరిగిన మోసాన్ని గమనించిన వ్యాపారి గౌతమ్ తన ఖాతాల్లో మిగిలిన రూ.10 వేలను వెంటనే తన మిత్రుడి ఖాతాకు పంపించాడు. కొద్దిసేపటి తర్వాత ఫ్రాడ్ అనే పేరుతో తన మొబైల్‌కు కాల్ రాగా అతను ఆన్సర్ చేయలేదు. జరిగిన మోసంపై నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు గౌతమ్ తెలిపాడు.

వానాకాలం.. పిడుగుల గండం..

- పిడుగులతో అత్యంత ప్రమాదం
- వర్షాల సమయంలో అప్రమత్తత అవసరం

రాయవరం/అంబాజీపేట: ఎండాకాలం తర్వాత వచ్చే వర్షాకాలం చాలా ఆహ్లాదంగా ఉంటుంది. వానల కారణంగా చెట్లు, పొలాలు ఆకుపచ్చ రంగులో కనువిందు చేస్తుంటాయి. సాగు పనులతో గ్రామాల్లో సందడి నెలకొంటుంది. అదే సమయంలో వర్షాకాలం ప్రమాదాలను కూడా తీసుకువస్తుంది. వాటిలో పిడుగులతో అనేక అనర్థాలు కలుగుతాయి. సాధారణంగా వర్షం కురిసే సమయంలో ఉరుములతో పాటు పిడుగులు పడుతుంటాయి. వాటి వల్ల పెద్ద ధ్వనులు, వెలుతురుతో పాటు విద్యుత్ శక్తి విడుదలవుతుంది. తుపానులు, భారీ వర్షాల సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందంటూ విపత్తు నివారణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది. అయితే పిడుగు ఎలా పడుతుంది, ఆ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

అనేక అనర్థాలు

పిడుగుల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో పశువులను మేపుకొనే కాపరులు, వ్యవసాయ పనులు చేసుకునే రైతులు, కూలీలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఒక్కొక్కసారి చెట్లు, మూగజీవాలు కూడా పిడుగుపాటుకు గురై మృత్యువాత పడుతున్నాయి. పిడుగు అంటే ఆకాశంలో సహజ సిద్ధంగా ఉత్పన్నమయ్యే విద్యుదాపాతం. మేఘాలు ఢీకొన్నప్పుడు వెలువడే కాంతిని మెరుపు, శబ్దాన్ని ఉరుము, ఉత్పన్నమయ్యే విద్యుత్తును పిడుగు అని పిలుస్తారు. అత్యధిక విద్యుత్తును కలిగిన పిడుగు పడడం వల్ల అసాధారణ నష్టాలు సంభవిస్తుంటాయి.

ఒక్క పిడుగులో..

ఒక్క పిడుగులో ఒక పట్టణ అవసరాలకు ఆరు నెలల పాటు విద్యుత్తు అందించగలిగే శక్తి ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. విరుద్ధ ఆవేశాలున్న మేఘాల మధ్య రాపిడి జరిగినప్పుడు మెరుపులు, ఉరుములు ఏర్పడతాయి. ఆ సమయంలో మేఘాల్లో రాపిడితో జనించే ఉష్ణం 50 వేల డిగ్రీల ఫారన్ గ్రేడ్ వరకూ ఉంటుందని అంచనా. ఈ వేడి అణువులన్నీ కలిసి ఒక నాళం మాదిరిగా ఏర్పడి భూమి మీద ఉన్న పాజిటివ్ ఎనర్జీతో కలిస్తే పిడుగు అవుతుంది. ఒక మిల్లీ సెకను కాలంలో మెరుపులతో కూడిన పిడుగు 20 ఆంపియర్ల విద్యుత్తు ప్రవాహాన్ని ఏర్పరుస్తుంది. ఆ సమయంలో ఏర్పడే క్షేత్ర తీవ్రత మీటర్‌కు 2 లక్షల ఓల్టులతో సమానమని చెబుతారు. మేఘాలు ఢీకొన్నప్పుడు జనించే విద్యుత్ తరంగాలు సన్నని మార్గంలో భూమి మీదకు చేరేందుకు వాహనాలను వెదుక్కొంటాయి. ఎత్తయిన చెట్లు, ఇనుప స్తంభాలు, ధ్వజ స్తంభాలు, ఎత్తయిన భవనాలపై కూడా పడతాయి.


పిడుగు పడే ముందు ఆకాశంలో వచ్చిన మెరుపు


పిడుగు పడుతున్న దృశ్యం (ఫైల్)

కాపర్ ఎర్త్

పిడుగు నుంచి తప్పించుకునేందుకు ఎత్తయిన ప్రదేశం నుంచి నేరుగా భూమిలోకి కాపర్ ఎర్త్ (రాగి వైరును అనుసంధానం చేస్తూ భూమిలోకి పాతాలి) ఏర్పాటు చేసుకోవాలి. ఇది దాదాపు కిలోమీటరు దూరంలో పడిన పిడుగును నేరుగా భూమిలోకి ఆకర్షించుకుంటుంది. ఉప్పు, కర్పూర బొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్‌ను భూమి లోపలకు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది.

జాగ్రత్తలు అవసరం

- వర్షం కురిసేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు. ముఖ్యంగా ఎత్తయిన చెట్లపై ఎక్కువగా పిడుగులు పడే అవకాశం ఉంది.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు. పిడుగులో లక్షల డిగ్రీల ఉష్ణోగ్రతతో విడుదలయ్యే వేడి ఒక్కసారిగా మనిషిని చేరగానే గుండెపై ప్రభావం చూపుతుంది.
- వర్షం కురుస్తున్న సమయంలో అందరూ గొడుగులను వాడుతుంటారు. అయితే వాటిపై ఇనుప బోల్టులు లేకుండా చూసుకోవాలి. మీ దగ్గర కెమెరాలు, సెల్ ఫోన్లు ఉంచుకోకూడదు. లేకుంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- మెరుపులు, పిడుగుల వల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోయే అవకాశం ఉంది. ఆ సమయంలో టీవీలకు ఉన్న విద్యుత్ కేబుల్ కనెక్షన్ తొలగించాలి.
- వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. తడి ప్రదేశాల్లో ఉండకపోవడం చాలా మంచిది.
- ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో చెరువులు, నది, సముద్రంలో ఈత కొట్టరాదు.

స్వల్పంగా పెరిగిన పొగాకు ధర

- కిలో గరిష్ట ధర రూ.293
- కొనసాగుతున్న కొనుగోళ్లు

దేవరపల్లి: వర్జీనియా పొగాకు ధర మార్కెట్‌లో స్వల్పంగా పెరిగింది. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాలకు బుధవారం 5,516 బేళ్లు అమ్మకానికి రాగా, వాటిలో 3917 బేళ్లు కొనుగోలు చేశారు. 1,599 బేళ్లను ట్రేడర్లు తిరస్కరించారు. కిలో గరిష్ట ధరను రూ.3 పెంచి కొనుగోలు చేశారు. మార్చి 24 నుంచి ఈ నెల 22 వరకు మార్కెట్లో కిలో గరిష్ట ధర రూ.290 పలికింది. దాదాపు 72 రోజులు ఈ ధర నిలకడగా కొనసాగింది. మంగళవారం మార్కెట్లో కిలో ధర రూ.291 పలకగా, బుధవారం మార్కెట్లో రూ.292 నుంచి రూ.293 లభించింది. అంటే మూడు రోజుల వ్యవధిలో రూ.3 పెరిగింది.

ఎక్స్ గ్రేడ్ పొగాకుపై ఆసక్తి

ఎక్స్ గ్రేడ్ పొగాకు కొనుగోలుకు ట్రేడర్లు ఆసక్తి చూపడంతో రైతులు తమ వద్ద ఉన్న ఆ గ్రేడ్ పొగాకును వేలం కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. అయితే ఈ ధర కంటితుడుపు చర్య మాత్రమేనని, కిలోకు సగటు ధర రూ.350 ఉంటే గిట్టుబాటు అవుతుందని కౌలు రైతులు చెబుతున్నారు. బుధవారం మార్కెట్లో ఐదు వేలం కేంద్రాల్లో ఎస్ఎల్ఎస్ పొగాకు 1,66,537 కిలోలు కొనుగోలు చేయగా, బ్లాక్ సాయిల్(బీఎస్) పొగాకు 7,086 కిలోలు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు 21.41 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. వేలం కేంద్రాల వారీగా దేవరపల్లిలో కిలో గరిష్ట ధర రూ.292, సగటు ధర రూ.268, జంగారెడ్డిగూడెం–1లో గరిష్ట ధర రూ.293, సగటు ధర రూ.276, జంగారెడ్డిగూడెం–2లో గరిష్ట ధర రూ.292, సగటు ధర రూ.279.27, కొయ్యలగూడెంలో గరిష్ట ధర రూ.293, సగటు ధర రూ.271.55, గోపాలపురంలో గరిష్ట ధర రూ.293, సగటు ధర రూ.279.17 లభించింది. ఐదు వేలం కేంద్రాల కిలో సగటు ధర రూ. 275.09 పలికింది.


దేవరపల్లిలో పొగాకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

బాలుడిపై పోక్సో కేసు

రామచంద్రపురం రూరల్: బాలికను వేధిస్తున్న బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. బాలుడు తరచుగా ఇంటి వద్ద ఎవ్వరూ లేని సమయంలో వచ్చి బాలికను వేధింపులకు గురి చేస్తున్నాడు. దీనిపై బాలుడి తల్లిదండ్రులు, అమ్మమ్మకు తెలియజేయగా వారు సైతం బాలుడికి మద్దతుగా మాట్లాడారు. పైగా చంపుతామని బెదిరించారు. ఈ మేరకు బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బాలుడిపై పోక్సో కేసు, అతడి అమ్మ, నాన్న, అమ్మమ్మలపై బెదిరింపులకు సంబంధించిన కేసు నమోదు చేశారు.

ఐదుగురికి రిమాండ్

కపిలేశ్వరపురం: మండలంలోని వడ్లమూరు గ్రామంలో హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఐదుగురుకి కోర్టు రిమాండ్ విధించినట్టు ఎస్సై హరీష్ కుమార్ బుధవారం తెలిపారు. ఈ నెల 22న రాత్రి సమయంలో వడ్లమూరు గ్రామంలో పాత గొడవల నేపథ్యంలో ముగ్గురిని కొందరు తీవ్రంగా కొట్టారు. దానిపై అదే రోజు అంగర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు అనంతరం బుధవారం ఐదుగురు నిందితులను అరెస్టు చేసి ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా జడ్జి రిమాండ్ విధించారు.

ముక్తేశ్వరస్వామి ఆలయంలో చోరీ

పెదపూడి: సంపర గ్రామ శివారున గల వీక్షణ ముక్తేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. స్వామివారి వెండి కిరీటాన్ని, అమ్మవారి బంగారు మంగళ సూత్రాన్ని దొంగలు అపహరించారు. ఎస్సై ఎస్.తులసీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. దొంగలు ముందుగా ఆలయంలో సీసీ కెమెరాల వైర్లు కట్ చేశారు. ఆలయం బయట తలుపులు పగలగొట్టి, గర్భగుడి తలుపులను ధ్వంసం చేశారు. అనంతరం స్వామివారి 1,330 గ్రాముల వెండి కిరీటం, పూజా సామగ్రి, అమ్మవారికి చెందిన ఒక గ్రామున్నర బంగారం మంగళ సూత్రాన్ని అపహరించుకుపోయారు. బుధవారం ఉదయం అర్చకుడు ఆలయానికి వచ్చేసరికి తలుపులు ధ్వంసం చేసి, లైట్లు వేసి, పరిసరాలు చిందరవందరగా ఉన్నాయి. ఆయన వెంటనే ఆలయ ఈఓ వడ్డాది సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. ఈఓ ఫిర్యాదు మేరకు కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు, ఇతర వివరాలు సేకరించాయి. ఎస్సై తులసిరామ్ సంఘటన స్థలంలో స్థానికులు, ఆలయ అర్చకుడు, ఈఓతో మాట్లాడి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ముక్తేశ్వరస్వామి ఆలయంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

● బుడిబుడి నడకలు



తొలకరి వర్షాలు మొదలు కావడంతో ఖరీఫ్ పనులు ప్రారంభం కానున్నాయి. రబీ అనంతరం ఖాళీగా ఉన్న పొలాల్లో సాగు పనులకు రైతులు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలు, నెల్లూరు, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో బాతులను వాటి కాపరులు మన ప్రాంతానికి తీసుకు వచ్చారు. పొలాల్లోని ధాన్యం గింజలు, పురుగులు తదితర వాటిని బాతులు ఆహారంగా తీసుకుంటాయి. అలాగే వాటి రెట్ట పొలానికి ఎరువుగా కూడా ఉపయోగపడుతుంది. రాయవరం – సోమేశ్వరం గ్రామాల మధ్య పొలాలకు మేతకు వెళుతున్న బాతుల గుంపు కనిపించింది. – రాయవరం

సత్యదేవా... చూడవయ్యా..

- శిథిలావస్థకు చేరిన సీతారామ సత్రం
- కూల్చివేయాలని గతంలోనే నిర్ణయం
- తాజాగా మరమ్మతులు చేయాలని ప్రతిపాదన
- రూ.2 కోట్లు ఖర్చవుతాయని ప్రాథమిక అంచనా

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి రూపాయినీ ఆచితూచి ఖర్చు చేయాలి. అయితే శిథిలావస్థకు చేరడంతో కూల్చివేయాలని గతంలో నిర్ణయించిన ఓ భవనానికి మరమ్మతులు చేయాలని దేవస్థానం అధికారులు నిర్ణయించడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దీని మరమ్మతులకు సుమారు రూ.రెండు కోట్లు వ్యయమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

వివరాలు ఇవీ..

రత్నగిరిపై గల సీతారామ సత్రాన్ని 94 గదులతో 1990లో నిర్మించారు. ఈ సత్రం ఆవరణలో వివాహాలు కూడా పెద్ద సంఖ్యలో జరిగేవి. అయితే ఈ సత్రం శిథిలావస్థకు చేరడంతో దానిలో బస చేసేందుకు భక్తులు భయపడేవారు. దీంతో దాన్ని కూల్చివేసి, అక్కడ నూతన సత్రాన్ని నిర్మించేందుకు పరిశీలన జరిపి నివేదిక ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ అధికారులను 2024లో అప్పటి ఈఓ, ప్రస్తుత దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ కోరారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఆ సత్రాన్ని పరిశీలించి, దాని పిల్లర్లు, కాలమ్స్ బలహీనపడ్డాయని, శ్లాబ్ పెచ్చులుగా ఊడిపోతోందని, కాబట్టి కూల్చివేయాలని నివేదిక సమర్పించారు.


అన్నవరంలో శిథిలావస్థకు చేరిన సీతారామ సత్రం

నూతన సత్రానికి టెండర్

ఆ నివేదిక ఆధారంగా నూతన సత్రం నిర్మించాలని అప్పటి ఈఓ నిర్ణయించారు. రూ.11.40 కోట్లతో తొలి దశలో నాలుగు అంతస్తులతో 105 గదులతో సత్రం నిర్మాణానికి టెండర్లు పిలవగా దాదాపు 16 శాతం లెస్‌కు టెండర్లు ఖరారయ్యాయి. జీ ప్లస్ త్రీఫ్లోర్లతో ఈ నిర్మాణం సాగనుంది. గ్రౌండ్ ఫ్లోర్‌ను వాహనాల పార్కింగ్‌కు వదిలేస్తారు. మొదటి, రెండు, మూడు ఫ్లోర్‌లలో ఫ్లోర్‌కు 35 గదుల చొప్పున 105 గదులు నిర్మించాలని నిర్ణయించారు.

మరమ్మతులకు సూచన

దేవదాయశాఖ సలహాదారు, విశ్రాంతి ఇంజినీర్ సుబ్బారావు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ సత్రాన్ని పరిశీలించారు. దీనికి మరమ్మతులు చేయిస్తే మరో ఐదేళ్లు పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. అదే విషయాన్ని దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ కు నివేదించారు. దీంతో ఆయన నూతన సత్రం నిర్మించడానికి మరో స్థలం చూడాలని ఆదేశించారు. దీంతో సత్యగిరిపై విష్ణుసదన్ పక్కనే నూతన సత్రం నిర్మించాలని ప్రతిపాదించారు.


సత్రం గదుల లోపల పరిస్థితి

మరమ్మతులకు రూ.2 కోట్లు

సీతారామ సత్రం మరమ్మతులకు దాదాపు రూ.రెండు కోట్లు వ్యయమవుతుందని ఇంజినీరింగ్ అధికారులు తాత్కాలికంగా అంచనా వేశారు. సత్రం అన్ని గదులు పరిశీలించిన తర్వాత పూర్తి అంచనాలు రూపొందిస్తే ఇంకా వ్యయం పెరుగుతుంది తప్ప తగ్గే పరిస్థితి ఉండదని భావిస్తున్నారు. మరమ్మతుల అనంతరం ఆ సత్రం ఎంత కాలం ఉంటుందోనన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

శనైశ్చరస్వామి క్షేత్ర ప్రతిష్ఠను పెంచేందుకు చర్యలు


మందపల్లి దేవస్థానం ఈఓ సురేష్‌బాబు

కొత్తపేట: శనిదోష నివారణకు దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర)స్వామి క్షేత్రంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు క్షేత్ర ప్రతిష్ఠను మరింత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని దేవస్థానం నూతన కార్యనిర్వాహణాధికారి (ఈఓ) డి.సురేష్‌బాబు అన్నారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, వాడపల్లి దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఇన్‌చార్జి ఈఓగా వ్యవహరించారు. పూర్తిస్థాయి ఈఓగా రాజానగరం అన్నదాన సత్రం ఈఓగా పనిచేసిన సురేష్‌బాబు నియమితులయ్యారు. ముందుగా ఆయనకు దేవస్థానం సిబ్బంది, అర్చకులు వేదాశీర్వచనాలతో స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం సిబ్బందితో కలిసి ఆలయ ప్రాంగణం, పరిసరాలు, ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను ఈఓ పరిశీలించారు. స్వామివారికి పూజలు, తైలాభిషేకాలు, ఇతర సేవలు, విధివిధానాలపై అర్చకులను అడిగి తెలుసుకున్నారు.

నా భర్త ఆచూకీ తెలపండి

సామర్లకోట: బయటకు వెళ్లిన తన భర్త ఇంటికి తిరిగి రాలేదని, అతడి ఆచూకీ తెలియజేయాలంటూ పేకేటి శరణ్య అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె మాట్లాడుతూ చంద్రంపాలెం గ్రామంలోని మసీదు చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకంపై తన భర్త శ్రీనివాసరావు ప్రశ్నించాడని, వారే అతడిని మాయం చేశారనే అనుమానం వ్యక్తం చేసింది. ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటకు బయటకు వెళ్లిన శ్రీనివాసరావు రాత్రి వరకు రాలేదని, దీంతో బంధువుల ఇంటిలో వాకబు చేయగా ఫలితం కనిపించలేదని తెలిపింది. కాగా.. చంద్రపాలెం మెయిన్ రోడ్డు సెంటర్‌లో శ్రీనివాసరావు జ్యూస్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో నీలం రంగు ప్యాంటు, ఎరుపు, నీలం గళ్ల షర్టు ధరించాడు. సుమారు 5.1 అడుగుల ఎత్తు ఉంటాడు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ శరణ్య చేసిన ఫిర్యాదుపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమర్థవంతంగా మూల్యాంకన


మూల్యాంకన ప్రక్రియను పరిశీలిస్తున్న నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, మూల్యాంకన ప్రక్రియను సమర్థంగా పూర్తి చేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అధ్యాపకులకు సూచించారు. గోదావరి జిల్లాల్లోని 40 అనుబంధ బీఈడీ కళాశాలల 3వ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన మూల్యాంకణ ప్రక్రియ యూనివర్సిటీ సెమినార్ హాలులో జరుగుతోంది. ఈ సందర్భంగా ఆ ప్రక్రియను బుధవారం సందర్శించిన ఆమె.. సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అనపర్తి: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రాజమహేంద్రవరం జీఆర్‌పీ ఎస్సై పెబ్బిలి లోవరాజు బుధవారం తెలిపారు. ద్వారపూడి – అనపర్తి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలపై సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతదేహం పడి ఉందన్నారు. అతడి ఒంటిపై లేత నీలి రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్టు తెలిపారు. దీనిపై సమాచారం కోసం ఎస్సై 94914 44022, సీఐ 94406 27551, ల్యాండ్ లైన్ 0883 2442821 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కోత అనంతర పద్ధతులతో పంటకు విలువ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మిరప, పసుపు వంటి వాణిజ్య పంటలలో కోత అనంతరం పాటించే పద్ధతుల ద్వారా వాటి విలువ, మార్కెట్ సామర్థ్యం, నిల్వ సమయం పెరుగుతాయని జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్–నిర్కా) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. స్థానిక జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ కార్యాలయంలో నాబార్డు సహకారంతో మంజూరు చేసిన చిల్లీ హీట్ పంప్ డ్రైయర్, టర్మిక్ ప్రాసెసింగ్ యూనిట్లను బుధవారం నాబార్డు ఏజీఎం ఎం.రాజశేఖరరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. నాబార్డు ఏజీఎం ఎం.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ఐకార్–నిర్కా, నాబార్డు సంయుక్త భాగస్వామ్యంతో వాణిజ్య రంగం మరింత స్థిరంగా మారుతుందన్నారు. నాబార్డు డీడీఎం ఆర్.చక్రధర్, పోస్ట్ హార్వెస్ట్ విభాగాధిపతి డాక్టర్ కేఎల్ ప్రసాద్ మాట్లాడారు.